# ఏపీకి డెల్.. బెల్!

## డేటా సెంటర్ ఏర్పాటుకు డెల్ సుముఖం.. రాష్ట్రంలో బెల్ హెలికాప్టర్ల తయారీ కేంద్రం

- **విత్తనోత్పత్తి.. వ్యవసాయ పరిశోధనలో.. రాష్ట్రానికి అయోవా వర్సిటీ సహకారం**
- **సిలికానాంధ్ర వర్సిటీలో రూ.6.5 కోట్లతో.. అమరావతి భాషా శాస్త్ర పీఠం.. ప్రకటించిన సీఎం**
- **అమెరికాలో మూడో రోజు సీఎం బృందం బిజీ బిజీ**

అమరావతి, మే 7 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్స్ దిగ్గజం 'డెల్' అమరావతి దిశగా అడుగులు వేస్తోంది. దీంతోపాటు హెలికాప్టర్ల తయారీలో ప్రపంచ ఖ్యాతి చెందిన 'బెల్' కూడా నవ్యాంధ్రలో తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు సుముఖత తెలిపింది. అమెరికాలో మూడో రోజు పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు బృందం డాలస్‌లో డెల్ ప్రతినిధి శ్రీకాంత్ సత్యతో భేటీ అయింది. అమరావతిలో కానీ.. రాష్ట్రంలో మరెక్కడైనా కానీ డెల్ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు శ్రీకాంత్ సత్య సంసిద్ధత వ్యక్తం చేశారు. అనంతరం సీఎం బృందం బెల్ సంస్థ ప్రతినిధులతో సమావేశమైంది. రాష్ట్రంలో పెట్టుబడిదారుల కోసం ఆకర్షణీయమైన 'విమానయాన విధానం' తీసుకొచ్చామని బెల్ డైరెక్టర్ చాద్ స్పార్క్స్ బృందానికి సీఎం వివరించారు. ఈ రంగంలో 75 మిలియన్ డాలర్లకు మించి పెట్టుబడులు పెట్టే సంస్థలకు 'టైలర్ మేడ్' పాలసీని సిద్ధం చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. రాష్ట్రానికి స్వయంగా వచ్చి పెట్టుబడుల వాతావరణాన్ని పరిశీలించాలని చాద్ బృందాన్ని సీఎం ఆహ్వానించారు. రాష్ట్రంలో హెలికాప్టర్ తయారీ సదుపాయాల కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని చాద్ సీఎంకి హామీ ఇచ్చారు. అనంతరం సీఎం బృందం అయోవాకు చేరుకుంది. అక్కడ అయోవా స్టేట్ యూనివర్సిటీకి చెందిన సీడ్ సైన్స్ సెంటర్‌తో ఏపీ ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. వ్యవసాయ రంగంలో ఆంధ్రప్రదేశ్‌కు అయోవా వర్సిటీ సంపూర్ణ సహకారాలు అందించనున్నది. ఇందుకోసం రాష్ట్రానికి వర్సిటీ శాస్త్రవేత్తల బృందాన్ని పంపనున్నది. ఈమేరకు వరల్డ్ ఫుడ్ ప్రైజ్ ఫౌండేషన్ భవనంలో.. కరువు, ఆహారం భద్రతపై పోరాడిని మహాత్మాగాంధీ, జార్జ్ వాషింగ్టన్ చిత్ర పటాల సాక్షిగా అవగాహన ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందంపై ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, అయోవా రాష్ట్ర వ్యవసాయ మంత్రి బిల్ నోర్తి సంతకాలు చేశారు. విత్తనోత్పతిపై జరిగిన ఒప్పందం రాష్ట్రానికి ప్రయోజనం చేకూరుస్తుదని అధికారులు తెలిపారు.


ఇర్వింగ్ సమావేశంలో చంద్రబాబు చుట్టూ భద్రతగా నిలిచిన అమెరికా పోలీసులు

### సీఎంతో 28 ఐటీ సంస్థల భేటీ

ఐటీ రంగంలో పేరొందిన 28 సంస్థలకు చెందిన ప్రతినిధులు సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. వీరంతా ప్రవాసాంధ్రులే. అమరావతి, విశాఖ నగరాల్లో లీజుకు తీసుకున్న స్థలాల్లో కార్యకలాపాలను చేపట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఈ సంస్థల ప్రతినిధులు సీఎం బృందానికి స్పష్టం చేశారు. ప్రీమియర్, గ్లోబల్ ఔట్‌లుక్ , టెక్‌ప్రోస్ సాఫ్ట్‌వేర్, అర్కస్ టెక్, శ్రీటెక్, మద్ది సాఫ్ట్, గురూస్, ఇన్ఫోటెక్, ఏఈ ఇన్ఫోటెక్, ఆక్టస్ తదితర కంపెనీల ప్రతినిధులు సీఎంతో భేటీ అయినవారిలో ఉన్నారు. ఈ కంపెనీల రాకతో ప్రాథమిక దశలో విశాఖలో 310, అమరావతిలో 64 మందికి ఉద్యోగాల కల్పన జరుగుతుంది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. వ్యవసాయ కుటుంబాల నుంచి వచ్చినా సాంకేతికతను అంది పుచ్చుకున్నారని ప్రవాసాంధ్రులను ప్రశంసించారు. ఒకప్పుడు రాష్ట్రంలో 30 ఇంజనీరింగ్ కాలేజీలు మాత్రమే ఉండేవని

.. తమ హయాంలో వాటిని 300కు పెంచామని, ఫలితంగా ఎంతో మంది ఇంజనీర్లు తయారయ్యారని సీఎం గుర్తు చేశారు.

### సిలికానాంధ్ర సేవలు భేష్

అమెరికా పర్యటనలో భాగంగా సీఎం బృందం సిలికానాంధ్ర విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా చంద్రబాబు బృందానికి అచ్చ తెలుగు సంప్రదాయవస్త్రధారణలో వేద మంత్రాలతో దిలీప్ కొండిపర్తి, రాజు చామర్తి, దీనబాబు కొండుభట్ల, అజయ్ గంటి తదితరులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సిలికానాంధ్ర విశ్వవిద్యాలయంలో 10 లక్షల డాలర్లతో అమరావతి భాషా శాస్త్ర పీఠం ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. వర్సిటీ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు. వర్సిటీలోని అన్ని బ్లాకులనూ సీఎం పరిశీలించారు. తెలుగు సంస్కృతి సంప్రదాయాలను అద్భుతంగా పరిరక్షిస్తున్నందుకు సిలికానాంధ్ర వర్సిటీని చంద్రబాబు అభినందించారు. వర్సిటీలోనే 'మన బడి' లోగోను సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 48 మంది సిలికానాంధ్ర సభ్యులు 4 జట్లుగా విడిపోయి 'తెలుగు పరుగు' పేరిట 191 మైళ్ల మారథాన్‌ను నిర్వహించారు.


డాలస్‌లో మేయర్ సహకారంతో ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహం వద్ద చంద్రబాబు, ప్రవాసాంధ్రులు

### మహాత్మునికి సీఎం నివాళి

డాలస్‌లో మహాత్ముని విగ్రహాన్ని సీఎం సందర్శించారు. పూలమాల వేసి నివాళులు అర్పించారు. మహాత్ముడు ప్రపంచానికి అహింసామార్గాన్ని అందించారని, ఉద్యమాలను శాంతియుతంగా నడపాల్సిన ఆవశ్యకతను వివరించారని సీఎం కొనియాడారు. ఇండియన్ అమెరికన్ ఫ్రెండ్‌షిప్ కౌన్సిల్(ఐఏఎఫ్‌సీ) అధ్యక్షుడు, తానా మాజీ చైర్మన్ తోటకూర ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కాగా, అమెరికాలో పర్యటిస్తున్న సీఎం బృందంలోని సీఎం ముఖ్యకార్యదర్శి జి.సాయిప్రసాద్ ఆదివారం పుట్టిన రోజు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సాయి ప్రసాద్‌కు కేక్ తినిపించి చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు.

## ఏపీలో స్టార్టప్‌లు పెట్టండి!

- **జన్మభూమి రుణం తీర్చుకోండి.. ప్రవాసాంధ్రులకు సీఎం పిలుపు**

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రలో ఐటీ స్టార్టప్‌లను ఏర్పాటు చేయడం ద్వారా ప్రవాసాంధ్రులు జన్మభూమి రుణం తీర్చుకోవాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. అమెరికా పర్యటనలో భాగంగా డాలస్, అయోవాలో ఆయన ప్రవాసాంధ్రులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతిఒక్కరూ కన్న తల్లి.. పుట్టిన ఊరు రుణం తీర్చుకోవాలని, జన్మభూమి రుణం తీర్చుకొనేందుకు ఇదే తగిన తరుణమని సీఎం పేర్కొన్నారు. తాను 2007లో ప్రతిపక్ష నేతగా డాలస్ వచ్చినప్పుడు కూడా ఇక్కడ ప్రవాసాంధ్రులు ఎంతో ఆప్యాయతను కనబరిచారని గుర్తు చేసుకున్నారు. ఆ ఆప్యాయత కారణంగానే తాను మరోసారి ఇక్కడికి వచ్చానన్నారు. డాలస్‌కు రాకపోయింటే తన అమెరికా పర్యటన సంపూర్ణమయ్యేది కాదని చంద్రబాబు వ్యాఖ్యానించారు. అమరావతి నిర్మాణం తన పూర్వజన్మ సుకృతంగా ఆయన అభివర్ణించారు. ఐయోవాలో.. టీడీపీ ఫోరమ్, ఏపీ ఎన్‌ఆర్‌టి సమావేశానికి సీఎం చంద్రబాబు హాజరయ్యారు. సీఎంను ప్రవాసాంధ్రులు సత్కరించారు. ఏడేళ్ల రిష్విత భాగవతంలోని ఒక పద్య పఠనంతో ఈ సమావేశం ప్రారంభమైంది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 'ఇక్కడ గత సంవత్సర కాలంలో 750 నూతన కంపెనీలను తెలుగువారు స్థాపించారని తెలుసుకుని చాలా సంతోషించాను. ఆంధ్రప్రదేశ్ అశాస్త్రీంగా, అడ్డగోలుగా విభజనకు గురైంది. కఠోర శ్రమ ద్వారా రాష్ట్రాన్ని మళ్లీ ప్రగతిపథంలో పయనింపజేస్తున్నాం. రాష్ట్రాభివృద్ధి తప్ప వేరేమీ నాకు అవసరం లేదు.' అని సీఎం స్పష్టం చేశారు.

### సీఎం టూర్‌లో ప్రవాసాంధ్రుల సందడి

చంద్రబాబుతో మాట్లాడేందుకు డాలస్, అయోవాలోని ప్రవాసాంధ్రులు ఉత్సాహం చూపారు. పలువురు ప్రవాసాంధ్రులు సీఎంతో కరచాలనం చేసేందుకు పోటీపడ్డారు. సీఎం బృందానికి ఘన స్వాగతం పలికారు. జై బాబు.. జై జై బాబు అంటూ నినదించారు. వారితో మాట్లాడిన సీఎం అమెరికాలోని ప్రవాసాంధ్రుల పరిస్థితి.. వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.